సీసీరోడ్లతో కొత్త శోభ

- గ్రామాల్లో జోరందుకున్న నిర్మాణాలు
- మండలానికి రూ.1.51 కోట్లు మంజూరు
- మార్చి 31 నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వ ఆదేశం



రెబ్బెనలో నిర్మిస్తున్న సీసీరోడ్డు

రెబ్బెన: ఉపాధిహామీ నిధులతో గ్రామాల్లో చేపడుతున్న సీసీరోడ్ల నిర్మాణాలతో గ్రామాలు కొత్త శోభ సంతరించుకోనున్నాయి. ప్రస్తుతం మండలంలోని అన్ని పంచాయతీల్లో రోడ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. మొదటి విడుతలో మంజూరైన రోడ్ల నిర్మాణ పనులు చివరి దశకు చేరుకోగా రెండో విడుతలో మంజూరైన రోడ్లలో కొన్ని ప్రారంభం కాగా మిగిలిన వాటి కోసం మెటీరియల్ సిద్ధం చేస్తున్నారు. కొన్ని పంచాయతీల్లో బిల్లులు వస్తాయో రావో అనే సందేహంతో నిర్మాణాలు చేపట్టేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు.

51 సీసీరోడ్లు.. రూ.1.51 కోట్లు

మండలంలో 24 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రభుత్వం అంతర్గత రహదారుల అభివృద్ధి కోసం ఈజీఎస్ నిధులతో సీసీరోడ్లు మంజూరు చేసింది. మండలానికి ఇప్పటి వరకు రూ.1.51 కోట్లతో 51 సీసీ రోడ్లు పనులు మంజూరు చేసింది. ఇప్పటికే కిష్టాపూర్, రెబ్బెన, నంబాల, వంకులం వంటి గ్రామ పంచాయతీల్లో కొన్ని రోడ్డు పనులు పూర్తి కాగా మిగిలిన పంచాయతీల్లో పనులు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం మార్చి 31 నాటికి రోడ్డు పనులు పూర్తి చేయాలని ఆదేశించింది. నిర్మాణ పనులు ఆలస్యమైతే సకాలంలో బిల్లులు వస్తాయో రావో అన్న అనుమానంతో నిర్ణీత గడువు కంటే ముందే పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లు భావిస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 9 రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి.

నాణ్యతపైనే అనుమానాలు..

ఈజీఎస్ నిధులతో మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణాలు ఆగమేఘాల మీద పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్లు ప్రయత్నిస్తున్నారు. ఒకటి, రెండు రోజుల్లోనే రూ.లక్షల విలువైన రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేస్తున్నారు. అయితే సీసీరోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యతపై ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు వేసి పూర్తి స్థాయిలో క్యూరింగ్ పనులు చేపట్టకుండానే వదిలేస్తున్నారు. గతంలో సీసీరోడ్లకు పూర్తి స్థాయిలో క్యూరింగ్ చేయకపోవటంతో కొన్ని నెలలకే పగుళ్లు తేలాయి. రోడ్డు నిర్మించిన తరువాత కనీసం 15 రోజులు క్యూరింగ్ చేయాలి. కాని రోడ్ల నిర్మాణాలు చేపడుతున్న కాంట్రాక్టర్లు మూడు రోజులు తూతూ మంత్రంగా క్యూరింగ్ చేసి చేతులు దులుపుకుంటున్నారు. దానికి తోడూ అన్ని పంచాయతీల్లో ఒకే దఫా నిర్మాణ పనులు ప్రారంభిస్తుండటంతో ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపిస్తుండటంతో నాణ్యత లోపిస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

నిధులు వెనక్కే..

ప్రభుత్వం మంజూరు చేసిన పనులను నిర్ణీత గడువులోగా ప్రారంభించకుంటే నిధులు వెనక్కి వెళ్లిపోనున్నాయి. మార్చి 31 నాటికి పనులు ప్రారంభించి నిర్మాణ దశలో ఉంటే నిధులు అలాగే ఉండిపోతాయి. గత సంవత్సరం మంజూరైన సీసీరోడ్లలో చాలా రోడ్లు ప్రారంభించకపోవటంతో నిధులు వెనక్కి వెళ్లిపోయాయి.

నెలాఖరులోగా పూర్తి చేస్తాం

మండలానికి మంజూరైన సీసీ రోడ్లన్నీ మార్చి 31నాటికి పూర్తి చేయాలి. మండలానికి 51రోడ్లు మంజూరు కాగా ఇప్పటి వరకు 9 రోడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మరో 10 రోడ్లు త్వరలోనే ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాయి. అన్ని రోడ్లు ప్రారంభించి నిర్ణీత గడువు లోగా పూర్తయ్యేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం.

- ఖాద్రీ, ఏఈఈ, పంచాయతీ రాజ్

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి



రెబ్బెన: మాట్లాడుతున్న డీఐఈవో నైతం శంకర్



కెరమెరి: నృత్యం చేస్తున్న విద్యార్థినులు

రెబ్బెన: విద్యార్థుల లక్ష్యం ఉన్నతంగా ఉంటే విజయం సాధ్యమవుతుందని డీఐఈవో నైతం శంకర్ అన్నారు. రెబ్బెన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన కళాశాల క్రీడా, ఫేర్‌వెల్ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో ప్రతి ఒక్కరు ఉన్నతమైన లక్ష్యాన్ని ఎంచుకోవాలన్నారు. క్రీడా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం డీఐఈవోను కళాశాల సిబ్బంది శాలువాతో సన్మానించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సతీశ్, అధ్యాపకులు, స్పోర్ట్స్ ఇన్‌చార్జీలు గంగాధర్, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

కౌటాల: గ్రామీణ ప్రాంత విద్యార్థులు జీవితంలో ఉన్నతంగా ఎదగాలని సీఐ సాదిక్‌పాషా అన్నారు. బుధవారం కౌటాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వీడ్కోలు పార్టీ, కళాశాల స్పోర్ట్స్ డే వేడుకలు నిర్వహించారు. ఆయన ఎస్సై మధుకర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీఐ మాట్లాడుతూ విద్యార్థి దశలో ఉన్నత లక్ష్యాలు కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో, ఇతర రంగాల్లో రాణించాలని సూచించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. విద్యార్థులు పట్టుదలతో చదివి రానున్న వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని తెలిపారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎస్సై మధుకర్, ప్రిన్సిపాల్ బాలకిషన్ రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కళాశాలలో ఘనంగా వీడ్కోలు సమావేశం

కెరమెరి: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఫేర్‌వెల్ పార్టీ ఉల్లాసంగా కొనసాగింది. వివిధ రకాల సినిమా పాటలపై విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డీఐఈవో శంకర్ మాట్లాడారు. విద్యార్థులు మంచి లక్షణాలు అలవర్చుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ పర్శరాములు, అధ్యాపకులు నవీన్ రెడ్డి, శ్రీహరి, స్వామి, కుత్బోద్దిన్, బైరాగి, రాము, సునీల్, ప్రిన్సిపాల్స్ సంపత్, లక్ష్మణ్, రాందాస్, అమరేందర్, శ్రీదేవి ఉన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

కాగజ్‌నగర్‌రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డి.లక్ష్మినరసింహం మాట్లాడుతూ మాతృభాష భావ ప్రకటనలో ఎంతో శక్తివంతమైన సాధనమన్నారు. అనంతరం విద్యార్థులు మాతృభాష ప్రాధాన్యతపై పాటలు పాడారు. వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రాజు, అధ్యాపకులు శారద, దత్తాత్రేయ, మహేష్, సంతోశ్, ప్రేంకుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాంప్లెక్స్ సమావేశం



సమావేశానికి హాజరైన ఉపాధ్యాయులు

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం విజయ నిర్మల ఆధ్వర్యంలో బుధవారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. పాఠశాలలో ఉపాధ్యాయుల బోధన తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయుల బోధన పద్ధతులను పరిశీలించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌లు వినేష్, కృష్ణకుమార్, శ్రీలత, గణేశ్, సీఆర్‌పీలు శ్రీనివాస్, శ్యాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు నిబద్ధతతో పని చేయాలి

కెరమెరి: ఉపాధ్యాయులు నిబద్ధతతో విధులు నిర్వహించాలని కెరమెరి కాంప్లెక్స్ హెచ్‌ఎం చంద్రశేఖర్, గోయగాం ఇన్‌చార్జి హెచ్‌ఎం నల్లగొండ రమేశ్ అన్నారు. బుధవారం మండలంలోని కెరమెరి, గోయగాం, ఝరికాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో వారు మాట్లాడారు. తొలిమెట్టులో భాగంగా అన్ని పాఠశాలల్లో టీఎల్‌ఎంలను బాగా ఉపయోగిస్తున్నప్పటికీ ఇంకా కొత్త పద్ధతులను అవలంభించాలన్నారు. ఆర్‌పీలు కృష్ణమూర్తి, వినీత్, ప్రత్యూష, సీఆర్‌పీలు, హెచ్‌ఎంలు ఉన్నారు.

కౌటాల తహసీల్దార్‌గా పుష్పలత

కౌటాల: మండల తహసీల్దార్‌గా ఇందరపు పుష్పలత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె ఆసిఫాబాద్ నుంచి కౌటాలకు బదిలీపై వచ్చారు. ఆమె మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తామన్నారు. రెవెన్యూ సిబ్బంది, పలువురు నాయకులు ఆమెను శాలువతో సన్మానించారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన శ్రీపాల్‌రెడ్డి బదిలీపై హన్మకొండకు వెళ్లారు.

వీధి దీపాల ఏర్పాటు

చింతలమానెపల్లి: మండలంలోని డబ్బా గ్రామ పంచాయతీలోని దరంపెల్లి, బారెగూడ గ్రామాలలో వీధి దీపాలు లేకపోవడంతో బుధవారం శ్రీశివరామ సాయి యూత్ ఆధ్వర్యంలో యువకులు వీధి దీపాలు ఏర్పాటు చేశారు. యూత్ సభ్యులను గ్రామస్తులు అభినందించారు. ఎన్నోసార్లు అధికారులకు సమస్యను విన్నవించినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. శ్రీనివాస్, ప్రకాశ్, బాపురావు, విలాస్, విజయ్, జలపతి, పోషన్న, శ్రీనివాస్, మధుకర్, తిరుపతి పాల్గొన్నారు.

గ్రామీణ సంప్రదాయ పోటీలను ప్రోత్సహించాలి



ఎడ్ల పందేలు ప్రారంభిస్తున్న నాయకులు

కౌటాల: గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయ పోటీలను ప్రోత్సహించాలని బీజేపీ మండలాధ్యక్షుడు నారులే వాసుపేటల్ అన్నారు. బుధవారం మండలంలోని మొగడ్‌దగడ్ గ్రామంలో ఛత్రపతి శివాజీ రైతు సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎడ్ల పందేలను ప్రారంభించారు. పోటీల్లో పాల్గొన్న రైతులకు బహుమతులు అందించారు. మరో నాలుగు రోజుల పాటు పోటీలు జరుగుతాయని నిర్వాహకులు కాశీనాథ్, ఎమ్మాజీ, రఘునాథ్, వసంత్‌లు తెలిపారు. ఉర్వత్ జీజాబాయి, బీఎస్పీ మండలాధ్యక్షుడు బండు పటేల్, నాయకులు మారుతి, సునీల్, సుధాకర్, వాతు, బిక్కు, గోసాయి, తదితరులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

ఆసిఫాబాద్‌అర్బన్: తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు సంఘం టీయూడబ్ల్యూజే (ఐజేయూ) 2024 సంవత్సర డైరీని బుధవారం జిల్లా కేంద్రంలో జిల్లా కలెక్టర్ హేమంత్ బోర్కడే , ఎస్పీ సురేశ్‌కుమార్‌లు ఆవిష్కరించారు. సంఘం నాయకులు పాల్గొన్నారు.

పామును అటవీప్రాంతంలో వదిలిన అధికారులు

సిర్పూర్(టి): మండలంలోని వేంపల్లి గ్రామ సమీపంలో ప్రధాన రహదారికి దగ్గరలో రెండు తలల పామును బుధవారం సిర్పూర్(టి) రేంజ్ అధికారి పూర్ణచందర్ ఆధ్వర్యంలో అటవీశాఖ అధికారులు గుర్తించి పట్టుకున్నారు. పామును అటవీప్రాంతంలో వదిలేసినట్లు సెక్షన్ అధికారి ముసవీర్ తెలిపారు.

ఆలయ ఉత్సవ కమిటీ

రెబ్బెన: గంగాపూర్ శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ ఉత్సవ కమిటీని బుధవారం దేవాదాయ ధర్మాదాయ కమిషనర్ అనిల్‌కుమార్ ప్రకటించారు. ఉత్సవ కమిటీ సభ్యులుగా లెండుగూరే గంటుమేర, మోర్లె తులసీరాం, అడప విమల, వనమాల స్వప్న, బొంగు నర్సింగరావు, తణుకు మురళీధర్, లోహ లక్ష్మణ్, లావుడ్య దుప్పా, లెండుగూరె జయరాం, మోడెం రాజాగౌడ్, దుర్గం అన్నాజీ, వడాయి మల్లేష్, చల్లూరి గంగయ్యలను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు.

'అవినీతి నాయకులను కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దు'

బెజ్జూర్: అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న నాయకులను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవద్దని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులు మాట్లాడుతూ కొంతమంది సోషల్ మీడియా వేదికగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ప్రచారం చేస్తున్నారన్నారు. అధికారం లేనప్పుడు కాంగ్రెస్ నాయకులపై కేసులు పెట్టి, హేళన చేసిన నాయకులు అధికారంలోకి రాగానే పార్టీలో చేరేందుకు చూస్తున్నారని, తమకు తెలియకుండా ఎవరినీ అధిష్టానం పార్టీలోకి చేర్చుకోవద్దని కోరారు. బ్లాక్ కాంగ్రెస్ తాలూకా అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు ఆత్రం రాజారాం, యూత్ మండల అధ్యక్షుడు ఎండీ హకీమ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దుర్గం దాసు, విష్ణుమూర్తి, చారి, బాబురావు, గంగయ్య, శైలేష్, లక్ష్మణ్, రాజబాబు, నాందేవ్, దేవాజి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



బెజ్జూర్: మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పెంచికల్‌పేట్: కాంగ్రెస్ పార్టీలోకి ఇతర పార్టీల నుంచి వచ్చే నాయకులను చేర్చుకుంటే ఊరుకునేది లేదని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండు హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ గత 10ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం పని చేసిన నాయకులకు తెలియకుండా బీఎస్పీ, బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించడం ఏంటని ప్రశ్నించారు. ఎల్కరి లచ్చన్న, రౌతు తిరుపతి, పుల్గం భాస్కర్, తాళ్ల లాంచు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన

వాంకిడి: మండల కేంద్రంలోని ఇంద్రానగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శివ పంచాయతన సహిత, అభయాంజనేయ విగ్రహ ప్రతిష్టాపన, ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ పెండ్యాల గౌతం శర్మ, బ్రహ్మశ్రీ గట్టు సీతారాం శర్మ, బ్రహ్మశ్రీ ఇందారపు శంకర్ శర్మ వేద పండితుల ఆధ్వర్యంలో హోమ కార్యక్రమాలు, యంత్ర స్థాపన, విగ్రహ ప్రతిష్టాపన చేశారు. అనంతరం పూర్ణహుతి, కుంబాభిషేకం, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు ఆంజనేయున్ని దర్శించుకుని పూజలు నిర్వహించారు. నిర్వాహకులు అన్నదాన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ముండె విమలబాయి, ఆసిఫాబాద్ జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్, గ్రామ పెద్దలు గాదె అనిల్, గాదె అవినాష్, గాదె ప్రవీణ్, గాదె శివకుమార్ పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న భక్తులు

'సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం'

రెబ్బెన: రాష్ట్ర ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వ ప్రసాద్‌రావు అన్నారు. పుంజుమేరగూడలో నిర్మిస్తున్న హనుమాన్ ఆలయం వద్ద బోర్‌వెల్ అవసరాన్ని గుర్తించి ఎస్‌డీఎఫ్ నిధులతో నూతన బోర్‌వెల్ మంజూరు చేశారు. బుధవారం బోర్‌వెల్ ఏర్పాటు పనులను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లావుడ్య రమేశ్, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు దేవాజీ, నాయకులు సుదర్శన్‌గౌడ్, చిరంజీవిగౌడ్, నాగేష్, మైనార్టీ మండల అధ్యక్షుడు ఇంరోజ్, నాయకులు గోగర్ల రాజేష్, గోపి, తులసీరాం తదితరులు పాల్గొన్నారు.



బోర్‌వెల్ పనులు ప్రారంభిస్తున్న విశ్వప్రసాద్‌రావు

బస్సుయాత్ర విజయవంతం చేయాలి

రెబ్బెన: బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించే విజయ సంకల్ప బస్సుయాత్రను విజయవంతం చేయాలని బీజేపీ పార్లమెంట్ కోకన్వీనర్ కొలిపాక కిరణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా బీజేపీ రాష్ట్ర శాఖ చేపట్టిన విజయ సంకల్ప యాత్ర గురువారం సాయంత్రం 5 గంటలకు ఆసిఫాబాద్‌కు చేరుకుంటుందన్నారు. యాత్రకు జిల్లాలోని పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. జిల్లా అధికార ప్రతినిధి ఆంజనేయులుగౌడ్, జిల్లా కార్యదర్శి కుందారపు బాలక్రిష్ణ, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సంజీవ్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నవీన్‌గౌడ్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పార్లమెంట్ కోకన్వీనర్ కొలిపాక కిరణ్‌కుమార్

ఉపాధ్యాయుడికి సన్మానం

రెబ్బెన: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుమారు 13 సంవత్సరాల పాటు విద్యార్థులకు ఇంగ్లిష్ పాఠాలు బోధించి ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో బదిలీ అయిన ఉపాధ్యాయుడు అనీస్ అహ్మద్‌ను బుధవారం పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయురాలు విజయరాణి, ఉపాధ్యాయులు ప్రభాకర్, గోపాల్, శ్రీదేవి, చరందాస్, తుకారాం, పార్వతి, జమునదాస్, రాజు, శ్రీధర్, అస్లం, శంకర్, లింగం పాల్గొన్నారు.

గద్దెపై కొలువుదీరిన సారలమ్మ

రెబ్బెన: రెండేళ్లకోసారి వచ్చే వన దేవతల జాతర మహోత్సవం బుధవారం ప్రారంభమైంది. జాతర మహోత్సవంలో భాగంగా మొదటి రోజు సారలమ్మ తల్లి గద్దెపైకి చేరుకుంది. డప్పు చప్పుళ్ల నడుమ పూజారి కంకల వనం నుంచి సారలమ్మ తల్లిని గద్దె పైకి తీసుకొచ్చి ప్రతిష్ఠించడంతో జాతర ప్రారంభమైంది. లక్ష్మీపూర్ శివారులోని సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద పూజారులు దేవార వినోద్, గొల్లపెల్లి సత్యభామలు ఆదివాసీ ఆచారాలతో పూజలు నిర్వహిస్తూ సారలమ్మతో పాటు పగిడిద్ద రాజు, గోవింద రాజులను గద్దెల వద్దకు తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. గోలేటి పంచాయతీ పరిధి గద్దెల వద్ద పూజారి ఇగురపు స్వామి సారలమ్మ తల్లిని గద్దెపై ప్రతిష్ఠించారు. భక్తులు అమ్మవారికి ఒడి బియ్యం, నిలువెత్తు బంగారం, తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కోళ్లు, మేకలను బలిచ్చి పూజలు చేశారు. జాతర మహోత్సవంలో భాగంగా గురువారం సాయంత్రం 5 గంటలకు కంకల వనం నుంచి కుంకుమ బరిణీ రూపంలో ఉన్న సమ్మక్క తల్లిని తీసుకొచ్చి గద్దెలపై ప్రతిష్ఠించనున్నట్లు పూజారులు తెలిపారు.

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పెద్దవాగు సమీపంలోని గద్దెల వద్ద సమ్మక్క సారలమ్మ జాతర బుధవారం ప్రారంభమైంది. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి సారలమ్మను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కాగజ్‌నగర్ పట్టణంతో పాటు చుట్టుపక్కల మండలాల నుంచి కూడా భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి పెద్దవాగులో స్నానాలు ఆచరించి తల్లిని దర్శించుకున్నారు. బంగారాన్ని (బెల్లం) సమర్పించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా జాతర కమిటీ అధ్యక్షుడు తుమ్మ రమేశ్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా సీఐ నాగరాజు, ఎస్సై సోనియా ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



రెబ్బెన: సారలమ్మ తల్లిని దర్శించుకుంటున్న భక్తులు



కాగజ్‌నగర్‌రూరల్: పూజలు చేస్తున్న భక్తులు



బెజ్జూర్: జాతరలో పాల్గొన్న భక్తులు

బెజ్జూర్‌లో..

బెజ్జూర్: మండలంలోని రేచిని, సోమిని, ఎర్రబండ ప్రాంతంలో సమ్మక్క-సారలమ్మ జాతర ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. జాతర కోసం ఎడ్లబండ్లు, ద్విచక్ర వాహనాలతో భక్తులు అటవీ ప్రాంతానికి చేరుకున్నారు. రేచినిలో తెల్లరావుల గుట్ట వద్ద సమ్మక్క-సారలమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రాణహిత నదిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి శివాలయం, సమ్మక్క -సారలమ్మ గద్దెలను దర్శించుకున్నారు. జెడ్పీటీసీ పుష్పలత, ఎంపీటీసీ సాయి, మాజీ ఎంపీపీ మనోహర్ గౌడ్, బెజ్జూర్ రంగనాయక కమిటీ అధ్యక్షుడు మహేష్, బీజేపీ నాయకులు పాల్వాయి శ్రావణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం..

ఉత్సవాల్లో బెజ్జూర్ వైద్య అధికారి అవినాష్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేశారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై విక్రం ఆధ్వర్యంలో ఏఎస్సై మోహన్, పోలీస్ సిబ్బంది భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతర కోసం వచ్చిన భక్తులు అటవీ ప్రాంతంలో నిప్పంటించొద్దని ఎఫ్ఆర్వో దయాకర్ సూచించారు. ఆయన వెంట డిప్యూటీ రేంజ్ అధికారి శ్రావణ్ కుమార్, బీట్ అధికారి శ్రీధర్ సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని పాత మధు ఆస్పత్రి సమీపంలో బుధవారం రాత్రి సిమెంట్ లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో స్తంభం విరిగిపోయింది. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. డ్రైవర్ మద్యం సేవించి ఉండటంతో ప్రమాదం జరిగిందని స్థానికులు పేర్కొంటున్నారు.

25న ఉచిత కంటి వైద్య శిబిరం

బెజ్జూర్: మండల కేంద్రంలోని అన్నపూర్ణ రైస్ మిల్లు సమీపంలో గల హనుమాన్ ట్రేడర్ ఎరువుల దుకాణం వద్ద ఈనెల 25న ఉచిత కంటి శిబిరం నిర్వహించనున్నట్లు కొండ్రా బ్రదర్స్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో దృష్టి లోపంతో బాధపడుతున్న వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులకు సైతం కంటి పరీక్షలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మొక్కులు చెల్లించుకున్న కోవ లక్ష్మి



మొక్కులు చెల్లించుకుంటున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి



బెల్లం బుట్టలతో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జీఎం రవి ప్రసాద్

ఆసిఫాబాద్‌అర్బన్: వన దేవతలు సమ్మక్క సారలమ్మలకు బుధవారం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి మొక్కులు సమర్పించారు. స్థానిక పెద్దవాగు నదీ తీరాన కొలువుదీరిన సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదట ఎమ్మెల్యే తన నివాసం నుంచి కుటుంబ సభ్యులతో కలిసి శోభాయాత్రగా గద్దెల వద్దకు చేరుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే భర్త సోనేరావ్, తనయుడు సాయి, కెరమెరి జెడ్పీటీసీ దూర్పతబాయి, బీఆర్ఎస్ నాయకులు సాంగ్డె జీవన్ తదితరులు పాల్గొన్నారు.

దర్శించుకున్న ఎమ్మెల్యే, జీఎం

రెబ్బెన: గోలేటి పంచాయతీ పరిధి పల్లవీ ఫ్యాక్టరీ సమీపంలోని సమ్మక్క సారలమ్మ గద్దెలను బుధవారం రాత్రి ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బెల్లంపల్లి ఏరియా జీఎం రవి ప్రసాద్‌లు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి బంగారం(బెల్లం) సమర్పించారు.

ఘనంగా బీరప్పకు పూజలు

కౌటాల: మండలంలోని శీర్షా గ్రామంలో గల బీరప్ప స్వామి ఆలయంలో కుర్మ కులస్తులు నిర్వహిస్తున్న బీరప్ప దేవుని పండుగ వేడుకలు బుధవారం కొనసాగాయి. బుధవారం భక్తి శ్రద్ధలతో ఆలయంలో నాగవెల్లి పట్నాలు వేసి భక్తితో కొలిచారు. మహిళలు బోనాలు సమర్పించి ఆలయంలో మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కళాకారుల బృందం బీరప్ప స్వామి చరిత్రను కథగా భక్తులకు వివరించారు. పర్వతాలు, శంకర్, రాజులు, పోశమల్లు, అల్లి తిరుపతి, బీరయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు